సాక్షి
నల్లగొండ
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



'సృజన' విజయ బావుటా..
హుజూర్‌నగర్‌కు చెందిన సృజన ముద్ర లోన్ పొంది వస్త్ర వ్యాపారాన్ని విస్తరించి పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. - 10లో



వెంటాడిన ఆర్థిక ఇబ్బందులు
రామన్నపేట మండలం నిదానపల్లికి చెందిన దంపతులు ఆర్థిక ఇబ్బందులతో ఉసురు తీసుకున్నారు. - 10లో



ఆస్తి కోసం ఘాతుకం
ఆస్తి కోసం సవతి కుమార్తెను హత్య చేసి మూసీలో పూడ్చిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. - 10లో

న్యూస్‌రీల్

అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు ఉండాలి



బుద్ధవనం అధికారులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

నాగార్జునసాగర్ : ప్రపంచ సుందరీమణులు మెచ్చేలా బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాట్లు చేయాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. మే12వ తేదీన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో జరగనున్న బుద్ధపూర్ణిమ కార్యక్రమానికి మిస్‌వరల్డ్ పోటీలకు హాజరవుతున్న ఆసియాదేశాల సుందరీమణులు హాజరుకానున్న నేపథ్యంలో ఆయన ఇక్కడి ఏర్పాట్ల సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్మితా సబర్వాల్, ఎండీ ప్రకాశ్‌రెడ్డితో మాట్లాడనని 90శాతం పనులు పూర్తయినట్లు వారికి వివరించినట్లు తెలిపారు. సమయం ఉన్నందున ఏర్పాట్లు ఘనంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుధన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ శ్రీనునాయక్, ఎస్‌ఐ సంపత్, బుద్ధవనం అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి



మిల్లు యజమానితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నార్కట్‌పల్లి : కొనుగోలు కేంద్రాలకు రైతులు ఆరబెట్టి, తూర్పార బట్టిన నాణ్యమైన ధాన్యాన్ని తేవాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని, తొండల్‌వాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. తొండల్‌వాయిలోని రైస్ మిల్లును సందర్శించి లారీల ద్వారా వచ్చే ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ గౌతమ్, ఎంపీఓ శ్రీదేవి, ఏఈఓ నవీన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల నుంచి దరఖాస్తులు

నల్లగొండ : నల్లగొండలోని చీఫ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో లష్కర్ పోస్టులు (229), హెల్పర్ (56) పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి ఆసక్తి గల అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ ఎం ప్యానెల్ అయిన ఆసక్తి గల అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలు రూ.500 రుసుం చెల్లించి వారి ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో డ్రా తీసి అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని ఎంపిక చేస్తామని తెలిపారు.

డీటీడీఓగా ముడావత్ చత్రునాయక్



నల్లగొండ : డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అధికారి (డీటీడీఓ)గా ముడావత్ చత్రునాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్‌లో పనిచేసిన ఆయన నల్లగొండకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పని చేస్తున్న రాజ్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

మద్దతు ధరకు మంగళం!

రకరకాల కొర్రీలతో ధాన్యం రేటు తగ్గిస్తున్న మిల్లర్లు



మిర్యాలగూడలోని ఓ మిల్లు వద్ద ధాన్యం ట్రాక్టర్లు

- సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధర చెల్లించని మిల్లర్లు
- వానాకాలం సీజన్‌తో పోల్చితే ధరలో భారీగా కోత
- దగ్గరుండి మిల్లుల్లోకి ధాన్యం ట్రాక్టర్లు పంపిస్తున్న అధికారులు
- వారి సాక్షిగానే మిల్లుల్లో సాగుతున్న దోపిడీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యాసంగి సీజన్‌లో మిల్లర్లు ధాన్యానికి ధర తగ్గించి అన్నదాతను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. మిల్లులకు పెద్ద మొత్తంలో ధాన్యం రావడంతో కొనుగోలు చేయకుండా మార్కెట్ లేదని, పచ్చ గింజ ఉందని, తాలు, ఎక్కువ డ్రై అయిందంటూ కొర్రీలు పెడుతూ ధర తగ్గిస్తున్నారు. ఒక మిల్లులో కొనకపోవడంతో మరో మిల్లుకు వెళ్లడం, అక్కడా కొనుగోలు చేయకపోవడంతో ఇంకో మిల్లుకు వెళ్లడం ఇలా రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అనేక అవస్థలు పడుతున్నారు. దీంతో అధికారులే దగ్గరుండి ధాన్యం ట్రాక్టర్లను మిల్లుల్లోకి పంపిస్తున్నా.. ధరను అమాంతం తగ్గిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో క్వింటాకు రూ.2,800 వరకు ధర పెట్టిన మిల్లర్లు ఇప్పుడు సుమారు రూ.500 నుంచి రూ.600 వరకు ధర తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లో నెమ్మదిగా కొనుగోళ్లు..
జిల్లాలో ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు వేగంగా సాగడం లేదు. 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయిస్తే గ్రేడ్–1 ధాన్యం క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్‌తో కలిసి రూ.2,820 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఆయా కేంద్రాల వద్ద కొనుగోళ్లలో వేగం పుంజుకోవడం లేదు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాద్దిప్పటి వరకు 10వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. 90 శాతం మంది రైతులు ధాన్యాన్ని మిల్లులకే అమ్ముకుంటున్నారు. ఇప్పటివరకు మిర్యాలగూడలో ఉన్న మిల్లుల్లోనే సుమారు 4 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు సమాచారం.

క్వింటాకు రూ.300 వరకు తగ్గింపు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో సుమారు 300కు పైగా రైస్ మిల్లులు ఉన్నాయి. వీటిలో సన్నరకం ధాన్యం వాటిల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర సాధారణ రకం క్వింటాకు రూ.2,300, గ్రేడ్–1 రకానికి రూ.2,320 ఉంది. కానీ మిల్లుల్లో వివిధ సాకులతో మద్దతు ధర కంటే రూ.100 నుంచి రూ.300 వరకు తగ్గిస్తున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడుస్తుందనే ఆందోళనతో మిల్లర్లు చెప్పిన ధరకే రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు. ఇక హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని పెద్దగా కొనడమే లేదు. ఏ మిల్లులోనైనా కొనుగోలు చేస్తే రూ.2100లోపే చెల్లిస్తున్నారు.

మిల్లర్లు ధర తగ్గించవద్దు



తేమ, పచ్చ గింజ, డ్రై అధికంగా ఉందని సాకులు చెప్పి ధర తగ్గించవద్దు. హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని కూడా ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. మార్కెట్‌లో ఆ ధాన్యానికి డిమాండ్ లేదని కొనకపోవడం సరైందికాదు. ఏ ధాన్యమైనా మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోలు చేయాలి.

– వీరేపల్లి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

హెచ్‌ఎంటీకి మార్కెట్ లేదు



ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. ఆ బియ్యం హెచ్‌ఎంటీలకు సమానంగా ఉంది. దీంతో మార్కెట్‌లో ఆ బియ్యానికి రూ.400కు పైగా ధర తగ్గిపోయింది. మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడంతో హెచ్‌ఎంటీ రకం ధాన్యాన్ని తక్కువగా కొనుగోలు చేస్తున్నాం. జైశ్రీరామ్, చింట్లు, జేఎస్‌ఆర్ తదితర సన్నరకం ధాన్యానికి దాదాపు మద్దతు ధర ఇస్తున్నాం.

– గౌరు శ్రీనివాస్, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



అధికారులు పట్టించుకోకపోవడం వల్లే మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్నారు. కావేరి చింట్లు రకానికి గత సీజన్‌లో రూ.2,800 వరకు కొన్నారు. ఇప్పుడు రూ.2,250 కే అమ్ముకోవాల్సి వచ్చింది.

– సత్యనారాయణరెడ్డి, నాగారం

2,100 రూపాయలే పెట్టారు



మిర్యాలగూడలోని ఓ మిల్లులో నా ధాన్యం క్వింటాకు రూ.2,100 ధర పెట్టారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల మద్దతు ధర కంటే తక్కువ ధరకే నా ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది.

– వెంకన్న, పాములపాడు

- అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ తదితరులు

మీసేవ కేంద్రాల్లో సర్వర్ డౌన్

- రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులకు తప్పని ఇబ్బందులు

రామగిరి(నల్లగొండ) : నిరుద్యోగులైన యువతకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు సర్వర్ సహకరించడం లేదు. ఈ నెల 14 తేదీ చివరి గడువు కావడంతో.. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించినా ఆ తర్వాత నేరుగా ఎంపీడీఓ ఆఫీసులో దరఖాస్తులను సమర్పించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డుతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో ఆమోదించిన తర్వాత సర్టిఫికెట్ జారీ అవుతుంది. ఇప్పుడు రెండవ శనివారం, ఆదివారం, సోమవారం (అంబేద్కర్ జయంతి) సెలవు దినాలు కావడంతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుకు శుక్రవారం మాత్రమే గడువు ఉందని కానీ, మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వర్ డౌన్ సమస్య వచ్చింది. దీంతో శుక్రవారం జనం మీ సేవ కేంద్రాల వద్ద బారులుదీరారు. సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకున్నా.. తహసీల్దార్ కార్యాలయ సమయం ముగియడంతో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో గందరగోళం ఏర్పడింది.



నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన జనం

సెలవు దినాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తాం : కలెక్టర్

నల్లగొండ : ప్రభుత్వ సెలవు దినాల్లోనూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు ప్రభుత్వం ఈనెల 14 చివరి తేదీగా నిర్ణయించిందని తెలిపారు. 12న రెండవ శనివారం, 14న అంబేద్కర్ జయంతి రోజున సెలవు దినాల్లోనూ దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తీసుకుంటారని తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : రాజ్యంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయర్, ఎమ్మెల్యే వేముల వీరేశంలు పిలుపునిచ్చారు. జై బాపు – జై భీమ్ – జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నకిరకల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యంగ పరిపరిక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యంగ నిర్మాణంలో చేసిన విశేష కృషిని గౌరవించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గాంధీ శాంతి సందేశం, అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాటం, రాజ్యంగ విలువలను ప్రజలకు చేరవేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శత్రు, మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, గాజుల సుకన్య, నకిరెకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, బత్తుల ఉశయ్య, దూదిమెట్ల సత్తయ్య, పెద్ది సుక్కయ్య, సుంకరబోయిన నర్సింహ, మల్లారెడ్డి, కంపసాటి శ్రీనివాస్, కోట మల్లి కార్జున్, లక్ష్మీనర్సు, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్, యాసా కరుణాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష విడనాడాలి

దేవరకొండ : ఆడపిల్లలు ఇంటికి మహాలక్ష్మిలని, ఆడపిల్లలపై వివక్షత విడనాడాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోషణ జాతర కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ గర్భిణులు సాధారణ ప్రసవాలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవద్దని, ఎవరైనా అలా పరీక్షలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ శాలిని, విజయ, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఏపీడీ శారద, రష్మీ, తదితరులు పాల్గొన్నారు.



పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గాడి తప్పుతున్న గురుకులాలు!

- తిప్పర్తి ఎస్సీ గురుకులంలో పిల్లల మధ్య గొడవలో ఓ విద్యార్థికి గాయం
- పాఠశాలలో ఎవరికి వారే ఇష్టారాజ్యం

నల్లగొండ : గురుకులాలు గాడి తప్పుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యా బుద్ధులు నేర్పించేందుకు గురుకులాల్లో చేర్పిస్తే.. ఇక్కడ వారిపై పర్యవేక్షణ ఉండడం లేదు. తాజాగా నల్లగొండ సమీపంలోని రామానందతీర్థ ఇంజనీరింగ్ కాలేజీ భవనంలో నిర్వహిస్తున్న తిప్పర్తి సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో ఒక విద్యార్థి మరో విద్యార్థి మర్మాంగంపై తన్నడంతో ఆ పిల్లవాడి పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సదరు విద్యార్థికి ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని సమాచారం.

పర్యవేక్షణ లేకనే..
ఈ గురుకులంలో ప్రిన్సిపాల్ పట్టించుకోకపోవడంతో ఉపాధ్యాయుల కూడా రెండు గ్రూపులుగా ఏర్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలిసింది. గతంలో కూడా ఒక ఉద్యోగి ఈ పాఠశాలలో అసభ్యంగా ప్రవర్తిస్తే విద్యార్థులే వీడియోలు తీసి బయట పెట్టారని తెలిసింది. ఇక ఉపాధ్యాయులు నచ్చిన విద్యార్థుల విషయంలో ఒకలా.. నచ్చని విద్యార్థులతో మరో విధంగా వ్యవహరిస్తున్నారని.. అందువల్ల విద్యార్థులు కూడా రెండు గ్రూపులుగా ఏర్పడ్డారని తెలుస్తోంది. ఇలా గ్రూపులుగా ఏర్పడడం వల్లే గురువారం 7వ తరగతి విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ఒక విద్యార్థి మరో విద్యార్థి మర్మాంగంపై తన్నడంతో గాయమైంది. అక్కడి సిబ్బంది ఆ విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స చేయించి తల్లిదండ్రులకు అప్పగించారు.

మెనూ కూడా పాటించడం లేదన్న ఆరోపణ..
ఈ పాఠశాల ప్రిన్సిపాల్ కొందరు ఉపాధ్యాయులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందులో పనిచేసే ఒక ఉద్యోగిని అటెండర్‌గా ఉపయోగించుకోవాలని సొసైటీ నుంచి ఆదేశాలు వచ్చినా మెస్ టేకర్‌గానే వాడుకుంటున్నారు. అయితే విధుల కేటాయింపులో ప్రిన్సిపాల్ కూడా పక్షపాతం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వ్యాయామం చేస్తుండగా దెబ్బ తగిలింది : ప్రిన్సిపాల్

విద్యార్థికి గాయమైన ఘటనపై ప్రిన్సిపాల్ సునీతను వివరణ కోరగా విద్యార్థులు వ్యాయాయం చేస్తుండగా ఓ విద్యార్థికి గాయమైందని.. ఆ విద్యార్థిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించామని.. అక్కడ నుంచి వారి తల్లిదండ్రులకు అప్పగిస్తే వారు ప్రైవేట్ అస్పత్రికి తీసుకెళ్లారని చెప్పారు. ఓ ఉద్యోగిని అటెండర్‌గా వాడుకోమని చెప్పింది వాస్తవమేనని.. ఆయా పనులకు అనుగుణంగా మెస్ టేకర్‌గా వాడుకుంటున్నామని తెలిపారు.

హనుమాన్ జయంతికి పటిష్ట భద్రత : ఎస్పీ

నల్లగొండ : హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ శోభాయాత్రలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా నిర్దేశించిన మార్గం, సమయపాలన పాటిస్తూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇతర మతాల వారి మనోభావాలను కించపరిచే విధంగా నినాదాలు చేయొద్దని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షిస్తామని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో పోలీసుల సూచనలు పాటించాలని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు.

మహనీయులను స్మరించుకుందాం



5కె రన్‌లో పాల్గొన్న ఎంజీయూ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్ : మహనీయుల త్యాగాలను స్మరించుకుని వారు ప్రజలకు చేసిన సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో పూలే విగ్రహానికి విద్యార్థులతో కలిసి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం సమ్మిళిత సమాజం పేరుతో విద్యార్థులు గడియారం సెంటర్ నుంచి మర్రిగూడ బైపాస్ రోడ్డు వరకు 5కే రన్ నిర్వహించారు. అనంతరం యూనివర్సిటీలో నిర్వహించిన మహనీయుల ఉత్సవాలకు తెలంగాణ బీసీ కమీషన్ సభ్యురాలు ఆర్. బాలలక్ష్మి హాజరై మాట్లాడారు. మార్పునకు పూలే దంపతులు చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, షీటీమ్స్ ఇన్‌స్పెక్టర్ కోట కరుణాకర్, ఉత్సవాల చైర్మన్ ప్రొఫెసర్ అంజిరెడ్డి, కన్వీనర్ శ్రీదేవిరెడ్డి, డాక్టర్ మద్దిలేటి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, సుధారాణి, వసంత, సరిత, శ్రీలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో ఫిర్యాదులు స్వీకరించారు. వృద్ధులు ఎక్కువగా పిల్లలు భూములు పట్టాలు చేయించుకుని తమను పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు చేయగా మరికొందరు పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. సోమ, మంగళవారాల్లో వారి సంబంధీకులను పిలిపించి సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత అధికారుల ద్వారా కౌన్సిలింగ్‌కు తేదీలను ఖరారు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పింఛన్ ఇప్పించండి



ఆరు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదం కారణంగా కాళ్లు, చేయి పని చేయకుండా పోయాయి. అప్పటి నుంచి పింఛన్ కోసం తిరుగుతున్నా. సదరం సర్టిఫికెట్ రాలేదు. పోషణ ఇబ్బందికరంగా మారింది. నేను నడవలేని పరిస్థితిలో ఉన్నా. సదరం సర్టిఫికెట్ ఇప్పించి నాకు పింఛన్ మంజూరు చేయాలి.

– వనం సత్యనారాయణ, శెట్టిపాలెం, వేములపల్లి మండలం

ఎలక్ట్రిక్ బండి ఇప్పించాలి



రోడ్డు ప్రమాదంలో నా కాలు తీసేశారు. నేను కర్రల సాయంతో నడుస్తున్నా. 8 సంవత్సరాల నుంచి ఇబ్బందులు పడుతున్నా. గతంలో వ్యవసాయం పనులు చేసేది. ఇప్పుడు ఎలాంటి పనులు చేయలేకపోతున్నా. 3 చక్రాల ఎలక్ట్రిక్ వాహనం ఇప్పించండి.

– బొడ్డు గాలయ్య, లింగోటం, కనగల్ మండలం

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



నాకు రోడ్డు ప్రమాదం కారణంగా వెన్నుపూస దెబ్బతిని ఆపరేషన్లు అయ్యాయి. ఎలాంటి పని చేయలేని పరిస్థితి. నేను చాలా నిరుపేదను. ఇల్లు కూడా లేదు. నాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలి. మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలి.

– దోమలపల్లి వెంకన్న, మాడ్గులపల్లి

పిల్లలు బువ్వ పెట్టడం లేదు



నాకు నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. ఇద్దరు బిడ్డలు మూడున్నర ఎకరాలను పట్టా చేసుకున్నారు. కొడుకు ఉన్న ఎకరం భూమిని పట్టా చేసుకుండు. నాకు పిల్లలెవరు భోజనం పెట్టడం లేదు. నా పరిస్థితి ఇబ్బందిగా ఉంది. నా పిల్లలు నా బాధ్యత చూసుకునేలా చూడండి. లేదా నా భూమి నాకు ఇప్పించండి.

– మద్దిసాయిలు, చీకటిమామిడి, మునుగోడు మండలం

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


ఆంజనేయులు

ఆలేరురూరల్: తాటిచెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆలేరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శారాజీపేట గ్రామానికి చెందిన దూడల అంజనేయులు(45) కుల వృత్తిలో భాగంగా ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి తాటి చెట్టు పైనుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలు అప్పగింత


వృద్ధురాలిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: కర్ణాటక రాష్ట్రానికి చెందిన వృద్ధురాలిని కలెక్టర్ శుక్రవారం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. వృద్ధురాలు నాగమ్మ తన ఇంట్లో సమస్యల కారణంగా మనస్థాపానికి గురై నల్లగొండకు వచ్చింది. సామాజిక కార్యకర్త శ్రీకాంత్ గత మూడు రోజుల క్రితం రైల్వే స్టేషన్లో వృద్ధురాలిని గుర్తించాడు. ఆమె వివరాలు అడిగి వయోవృద్ధుల శాఖకు సమాచారం ఇచ్చాడు. దీంతో వయోవృద్ధుల శాఖ అధికారి కృష్ణవేణి మెడికల్ కళాశాలలో చేర్పించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఆమెకు ఇక్కడ ఆశ్రయం కల్పించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు శుక్రవారం నల్లగొండకు రాగా కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నాగిరెడ్డి, శ్రీకాంత్ సునీల్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడరూరల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న ఆటోను కోదాడ రూరల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తమ్మర బండపాలేనికి చెందిన షేక్. సికిందర్ కోదాడ మండల బీక్యాతండాలో రేషన్‌కార్డుల దారుల నుంచి నాలుగు క్వింటాళ్ల పాత రేషన్ బియ్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేశాడు. వాటిని ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రామిరెడ్డిపల్లికి చెందిన భరత్ కుమార్‌కు విక్రయించేందుకు వెళ్తున్నాడు. కూచిపూడి వద్ద పోలీసులు, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. ఈమేరకు సికిందర్‌పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సృజన విజయబావుటా..

- ముద్రలోన్ పొంది వస్త్ర వ్యాపారాన్ని విస్తరించిన హుజూర్‌నగర్‌కు చెందిన మహిళ
- మరో ముగ్గురికి జీవనోపాధి
- ప్రధాని చేతులమీదుగా తెలంగాణ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న ఏకైక మహిళగా నిలిచిన సృజన


కుట్టుపనిలో కలువల సృజన

హుజూర్‌నగర్: తనదైన శైలితో ముందుకు సాగుతూ సమాజంలో అరుదైన 'ముద్ర' వేస్తూ ఇతరులకు ఆసరాగా నిలుస్తున్నారు హుజూర్‌నగర్‌కు చెందిన కలువల సృజన. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ముద్ర యోజన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఏకై క మహిళగా నిలిచారు. జీవితంలో ఎత్తుపల్లాలు చూసిన ఆమె స్వయంకృషితో విజయబావుటా ఎగురవేశారు. ఇందుకు తన భర్త కలువల సరేష్‌రెడ్డి ప్రోత్సాహం తోడుకావడంతో తాను ఈ స్థితికి చేరుకున్నానని ఆమె చెబుతున్నారు.

తన కాళ్లమీద తాను నిలబడాలని భావించి..

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చీదెళ్లకు చెందిన యడ్ల మల్లీశ్వరి అంజిరెడ్డి మూడో కుమార్తె సృజన డిగ్రీ వరకు చదువుకుంది. ఆమెకు హుజూర్‌నగర్‌కు చెందిన కలువల సరోజ, పాపిరెడ్డిల కుమారుడు సురేష్‌రెడ్డితో 2006లో వివాహం జరిగింది. ఆమె భర్త లారీ ట్రాన్స్‌పోర్టులో ఉద్యోగం చేసేవారు. ఇలా కొన్నేళ్లు వారి జీవితం సాఫీగా సాగింది. సృజన భర్త సహకారంతో కుట్టు మిషన్ నేర్చుకుంది. ఆ కుట్టు మిషన్‌తో కుటుంబానికి చేదోడు వాదోడుగా, తన కాళ్లమీద నిలబడాలని భావించింది. 2012లో ఇంటి వద్దే మిషన్ కుట్టడం ప్రారంభించింది. ఐదేళ్ల తర్వాత భర్త ప్రోత్సాహంతో తన వ్యాపారం విస్తరించాలని కుట్టు మిషన్‌ను మెయిన్‌రోడ్డులోని షాపులోకి మార్చింది. ఈ నేపథ్యంలో భర్త సూచనలతో 2020లో ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా ముద్రలోన్ రూ.2 లక్షలు పొందింది. ఆతర్వాత వ్యాపారం అభివృద్ధి కావడంతో బ్యాంక్ వారికి లోన్ కిస్తీలు, జీఎస్టీ, ఐటీ రిటన్స్ సక్రమంగా చెల్లించింది. దీంతో బ్యాంక్ వారు ఆమెకు మరోసారి రూ.8 లక్షలను రుణంగా అందజేశారు. తద్వారా తన షాపును మరింత విస్తరించి కట్టుపనులే కాకుండా వారి షాపులో అన్ని రకాల చీరలు, డ్రస్సులు, చిన్నపిల్లల, లేడీస్ వెరైటీలు, మహిళలకు సంబంధించి అన్నిరకాల వస్త్రాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం భార్యాభర్తలు ఇరువురు కలిసి హైదరాబాద్, విజయవాడ, కంచి, కోయంబత్తూరు, వారణాసి, కలకత్తా, బెంగుళూరుల నుంచి పట్టు చీరలు, ఇతర వస్త్రాలు, చిన్నారుల రెడీమెడ్ దుస్తులు తెచ్చి ఇక్కడ అమ్మకం చేస్తున్నారు. షాపులో మరో ముగ్గురు మహిళలను పనిలో పెట్టుకుని వారికి నెలకు రూ.15 వేలు వేతనంగా చెల్లిస్తూ వారికి జీవనోపాధి కల్పిస్తున్నారు. ఈనేపథ్యంలో ముద్ర లోన్ పొంది ఉత్తమ ప్రదర్శన కనబరిచి తెలంగాణ నుంచి విజయబావుటా ఎగురవేసిన ఏకైక మహిళగా నిలిచింది. ఈమేరకు సృజన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.


ఇటీవల ఢిల్లీలో జరిగిన ముద్ర యోజన దశాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు అందుకున్న సృజన - కుడి నుంచి మొదటి మహిళ (ఫైల్)

భర్త ప్రోత్సాహంతోనే..

నా భర్త సురేష్‌రెడ్డి ప్రోత్సాహంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నా. మా వ్యాపారంలో మహిళల చేయూత మరువలేనిది. అందరూ ఆదరించడం వల్లే మా వ్యాపారం అభివృద్ధి సాధ్యమైంది. మహిళలు స్వశక్తి శక్తితో ఎదగాలి. అన్ని రంగాల్లో రాణించాలి. మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోవడం నా జీవితంలో మరువలేని సంఘటన.

– కలువల సృజన, వస్త్ర వ్యాపారి, హుజూర్‌నగర్

హాషిష్ ఆయిల్ తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

- రూ.80లక్షల విలువగల హాషిష్ ఆయిల్ స్వాధీనం

భువనగిరి: రూ.80 లక్షలు విలువ చేసే మత్తు పదార్థమైన హాషిష్ ఆయిల్‌ను తరలిస్తున్న ఇద్దరిని ఎస్ఓటీ, భువనగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషరేట్‌లో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లాకు చెందిన పెట్ల శేఖర్ ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని శ్రీవిద్యా కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేశాడు. ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుల ద్వారా హైదరాబాద్‌లో గంజాయి సరఫరా చేసే దుర్గా అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇదే సమయంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో హషిష్ ఆయిల్ సరఫరా చేయాలని ఇద్దరూ నిర్ణయించుకున్నారు. దీంతో శేఖర్ తన చిన్ననాటి స్నేహితుడైన అనిమినిరెడ్డి దుర్గారావును కలిసి హాషిష్ ఆయిల్ గురించి వివరించాడు. దీంతో దుర్గా నుంచి హాషిష్ ఆయిల్ సేకరించి ఇద్దరు తమకు తెలిసిన ప్రాంతాల్లో అవసరమైన వారికి విక్రయించాలని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం శేఖర్, దుర్గారావులు దుర్గా వద్ద సుమారు 4 కేజీల హాషిష్ ఆయిల్ కొనుగోలు చేశారు. భువనగిరి రైల్వేస్టేషన్‌లో దిగి మండలంలోని అనంతారం గ్రామానికి వెళ్లే సర్వీస్ రోడ్డు మార్గంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో సమాచారం మేరకు ఎస్ఓటీ, భువనగిరి రూరల్ పోలీసులు వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద 4 కేజీల హాషిష్ ఆయిల్ ఉన్నట్లు గుర్తించారు. ఆయిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దుర్గా పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. సమావేశంలో డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఎస్ఓటీ పోలీసులు, రూరల్ ఎస్‌హెచ్ఓ సంతోష్‌కుమార్ ఉన్నారు.

కుక్కల దాడిలో రెండు మూగ జీవాలు మృతి

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని బట్టోనిబావి గ్రామంలో కుక్కల దాడిలో ఓ వ్యక్తి చెందిన మేక, గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన ఈదుల నర్సింహ మేకలు, గొర్రెలను గురువారం రాత్రి కొట్టంలోకి తోలాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూసేవరకు ఒక మేక, ఒక గొర్రె మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ.15వేల వరకు నష్టం జరిగిందిని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

మద్యం మత్తులో కారుతో ఢీ

- యువతి మృతి, యువకుడికి తీవ్రగాయాలు
- అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- మృతురాలు యాదాద్రి జిల్లా నారాయణపురం మండల వాసి

ఇబ్రహీంపట్నం: అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో యువతి అక్కడికక్కడే మృతిచెందగా.. యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కారుతో పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన కొప్పు శంకరయ్య కూతురు స్పందన (19) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఇంజనీరింగ్ కాలేజీలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. సైదాబాద్ సింగరేణికాలనీలో నివాసముండే తన స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి గురువారం సాయంత్రం బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డుపై ఘట్‌కేసర్ వైపునకు వెళ్తున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ ఎగిరి కారు అద్దంపై పడ్డారు. కారు అదే స్పీడ్‌లో వెళ్లడంతో కింద పడిపోయారు. స్పందన అక్కడికక్కడే మృతిచెందగా, సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సాయికుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. స్పందన మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో అదుపులోకి..

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన స్కోడా కారుతో సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్తుండగా కారు అద్దాలు పగిలి ఉండడం, డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. యాక్సిడెంట్ చేసినట్లు అంగీకరించడంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరి ప్రాంతానికి చెందిన ప్రదీప్ అనే వ్యాపారవేత్తగా గుర్తించారు. ప్రస్తుతం అతను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల అదుపులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వెంటాడిన ఆర్థిక ఇబ్బందులు

- దంపతుల మధ్య గొడవతో ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త
- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న భార్య
- విషయం తెలునుకుని గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డ భర్త
- తల్లిదండ్రుల మృతితో అనాథలైన చిన్నారులు


అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు

రామన్నపేట: పెంచుకున్న రెండు పాడిగేదెలు, రెండు పాడి ఆవులు చనిపోయాయి. సాగుచేసిన వరిపొలం ఎండిపోయింది. పెరిగిన అప్పుల కారణంగా దంపతుల మధ్య వాగ్వాదం నెలకొంది. భర్త ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్థాపంతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న భర్త మరుసటిరోజే గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఒక్కరోజు వ్యవధిలోనే దంపతులిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో చిన్నారులిద్దరూ అనాథలయ్యారు. హృదయ విదారకమైన సంఘటన రామన్నపేట మండలంలోని నిధానపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన బొబ్బల మల్లయ్య కుమార్తె కావ్య(25)కు రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామానికి చెందిన జినుకల ఆంజనేయులు(31)తో ఏడేళ్ల క్రితం జరిగింది. వారికి నిహాన్, విహాన్ అనే ఇద్దరు ఆరేళ్లలోపు కుమారులు ఉన్నారు. ఆంజనేయులు నిధానపల్లిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం వారికి చెందిన రెండు పాడిగేదెలు, రెండు పాడి ఆవులు చనిపోయాయి. దాంతో పాటు యాసంగిలో సాగుచేసిన వరిపొలం ఎండిపోయింది. ఆర్థిక సమస్యల కారణంగా ఈనెల 8న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదేరోజు భర్త ఆంజనేయులు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో మనస్థాపానికి గురైన కావ్య గురువారం తమ వ్యవసాయబావి వద్ద పశువుల కొట్టంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణవార్త తెలుసుకున్న ఆంజనేయులు హైదరాబాద్ నుంచి రామన్నపేటకు బయలు దేరాడు. మార్గమధ్యంలో గడ్డిమందు కొనుగోలు చేశాడు. ఇంద్రపాలనగరం శివారులోని అయ్యప్పగుడి సమీపంలో దానిని సేవించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో వారు అక్కడకు వెళ్లి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు. కాగా.. కావ్య, ఆంజనేయులు మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గ్రామంలో ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.


ఆంజనేయులు, కావ్య(ఫైల్)

అనాథలైన చిన్నారులు

తల్లిదండ్రులిద్దరూ ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుమారులు నిహాన్, విహాన్‌లు అనాథలయ్యారు. అంత్యక్రియల సమయంలో అక్కడ ఏం జరుగుతుందో తెలియక దీనంగా చూస్తూ ఉండిపోయారు. చిన్నారుల చూసి బంధువులు, గ్రామస్తులు కంటతడి పెట్టారు. హృదయ విదారకమైన సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


నిహాన్, విహాన్

ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరుమాఢ వీధుల్లో భక్తుల మధ్యన సేవను ఊరేగించారు. ఆండాళ్ అమ్మవారిని ఊరేగిస్తున్న సమయంలో మహిళ భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టించి ఊంజల్ సేవోత్సవాన్ని చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాథ స్వరాన్ని వినిపించారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యథావిధిగా కొనసాగాయి.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఒకరు మృతి

మాడ్గులపల్లి: రోడ్డు వెంట నిలిపిన ట్రాక్టర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం, గోప్యానాయక్‌తండా గ్రామానికి చెందిన ముడావత్ పీర్యా(36) చిట్యాల మండలం నుంచి పనినిమిత్తం తన ద్విచక్ర వాహనంపై హాలియా మండలం సూరేపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ శివారుకు చేరుకోగానే అదే గ్రామానికి చెందిన రేకా గోవింద్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌ను నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచాడు. ఈక్రమంలో బైక్‌పై వస్తున్న పీర్యా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతుడు పీర్యా

నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

- హతుడు నకిరేకల్‌కు చెందిన గద్దపాటి సురేష్‌గా గుర్తింపు


సురేష్ (ఫైల్)


ఘటనా స్థలంలో రక్తపుమడుగులో సురేష్ మృతదేహం

నల్లగొండ : పట్టణంలోని రామగిరిలో గల గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. నకిరేకల్ పట్టణానికి చెందిన గద్దపాటి సురేష్(44) నల్లగొండ పట్టణం రామగిరిలోని గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో మణికంఠ ఫొటో లేజర్ కలర్ ల్యాబ్ నిర్వహిస్తూ.. సమీపంలోనే అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. కాగా, శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి సురేష్‌పై కత్తులతో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన సురేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. సురేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడు మృతి


సతీష్ (ఫైల్)

శాలిగౌరారం: వడదెబ్బతో హమాలీ కార్మికుడు మృతిచెందాడు. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెంకు చెందిన బట్ట సతీష్(28) స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో హమాలీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎండల ధాటికి మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురై ఇంటివద్దే చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

ఆస్తి కోసం ఘాతుకం

సవతి కూతురును హత్యచేసిన మహిళ

- మృతదేహాన్ని మూసీనది ఇసుకలో పాతిపెట్టిన నిందితులు
- మృతురాలి తండ్రి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు
- ఫోన్‌కాల్ డేటా ఆధారంగా కేసును ఛేదించిన మేడిపల్లి పోలీసులు


ఇసుకలో మహేశ్వరిని పూడ్చిపెట్టిన గుంత


మహేశ్వరి మృతదేహాన్ని తీసుకెళ్తున్న బంధువులు

శాలిగౌరారం: ఆస్తి కోసం సవతి కూతురును హత్య చేసి మృతదేహాన్ని మూసీనదిలో పూడ్చిపెట్టగా పోలీసులు హత్య కేసును ఛేదించి ఆ మహిళతో పాటు ఆమెకు సహకరించిన ఇద్దరిని అరెస్టు చేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మాపురం గ్రామం పడమటితండా (డి)కి చెందిన జాటోతు పీనానాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య శాంతి, రెండవ భార్య లలిత. మొదటి భార్యకు కొడుకు, కూతురు మహేశ్వరి(23) ఉండగా రెండవ భార్య లలితకు కుమార్తె (14) ఉన్నారు. మొదటి భార్య శాంతి అనారోగ్యం బారిన పడడంతో 16 సంవత్సరాల క్రితం ఆమెకు పీనానాయక్ రూ.4 లక్షలు నగదు, పోషణ కోసం నెలకు రూ.4 వేలు ఇవ్వడంతో పాటు కుమార్తె మహేశ్వరిని తన వద్ద ఉంచుకొని చదివిపించి వివాహం చేసేవిధంగా పెద్దల సమక్షంలో ఒప్పదం చేసుకుని శాంతికి దూరంగా ఉంటున్నాడు. దీంతో శాంతి తన కుమారుడితో కలిసి దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామంలోని తన పుట్టినింటికి వచ్చి అక్కడే ఉంటోంది. శాంతి నుంచి విడిపోయిన సంవత్సరం తర్వాత పీనానాయక్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన లలితను రెండవ వివాహం చేసుకున్నాడు. ఆయన తన కుమార్తె మహేశ్వరి, రెండవ భార్య లలితతో కలిసి ఉంటున్నాడు. ప్రస్తుతం లలితకు కుమార్తె(14) ఉంది. ప్రస్తుతం పీనానాయక్ రెండవ భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మేడ్చల్ జిల్లా మేడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. పీనానాయక్‌కు స్వగ్రామంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమితో పాటూ హైదరాబాద్‌లోని బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలో రెండు సొంత ఇళ్లు ఉన్నాయి. తండ్రి, పిన తల్లి వద్ద ఉంటూ మహేశ్వరి(23) బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తుంది. మహేశ్వరికి వివాహం చేసేందుకు తండ్రి పీనానాయక్ పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. ఈ క్రమంలో శంషాబాద్‌కు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్న బంధువైన ఓ అబ్బాయికి మహేశ్వరిని ఇచ్చి వివాహం చేసుకునేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలో 2024 అక్టోబర్‌లో రూ.కోటి కట్నం ఇచ్చేవిధంగా ఒప్పందంతో నిశ్చితార్థం చేసుకున్నారు. మహేశ్వరికి కట్నం కింద బోడుప్పల్ లక్ష్మీనగర్‌లోని ఒక ఇల్లుతో పాటు బంగారం, కొంత నగదు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు.

డిసెంబర్ 7న ఇంట్లో హత్య చేసి...

మహేశ్వరిని చంపాలనే పథకంలో భాగంగా 2024 డిసెంబర్ 7న ఇంట్లో పాయసంలో నిద్రమాత్రలు వేసి మహేశ్వరికి ఇచ్చారు. ఆ పాయసం తాగిన మహేశ్వరి స్పృహ తప్పి పడిపోవడంతో లలిత, రవిలు కలిసి మహేశ్వరిని గొంతునులిమి చంపాశారు. అనంతరం మహేశ్వరి మృతదేహాన్ని గోనేసంచిలో మూటకట్టి మరో వ్యక్తి సహాయంతో అదేరోజు రాత్రి రవి కారులో మృతదేహాన్ని తీసుకువచ్చి నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని వంగమర్తి వద్ద మూసీనదిలో బ్రిడ్జి పిల్లర్ నెంబర్ 1 సమీపంలో ఇసుకలో గుంతతీసి పూడ్చి పెట్టారు. రాత్రి ఇంటికి వచ్చిన పీనానాయక్.. కుమార్తె మహేశ్వరి ఇంటికి రాకపోవడంతో ఎటు పోయిందని భార్య లలితను అడగగా డ్యూటీ కని చెప్పి ఇంట్లో ఫోన్‌వదిలి వెళ్లిపోయిందని, తాను ప్రేమించిన వ్యక్తితో ప్రేమ వివాహం చేసుకుంటానని ఫోన్‌చేసి చెప్పిందని వివరించింది. దీంతో భార్య చెప్పిన విషయాన్ని నమ్మిన మహేశ్వరి తండ్రి పీనానాయక్ కుమార్తెకు వివాహ నిశ్చితార్థం కావడంతో ప్రేమ విషయాన్ని బయటకు పొక్కుండా రహస్యంగా ఉంచి కుమార్తె కోసం వెతకడం ప్రారంభించాడు. మహేశ్వరిని వివాహం చేసుకునే అబ్బాయి మహేశ్వరి ఫోన్ ఎత్తడం లేదని, మెసేజ్‌లకు స్పదించడంలేదని మామ పీనానాయక్‌కు చెప్పడంతో అదోఇదో చెబుతూ నెట్టుకొస్తున్నాడు. ఈక్రమంలో ఆ అబ్బాయి ఒత్తిడి చేస్తుండటంతో వారం రోజుల క్రితం పీనానాయక్ తన కుమార్తె అదృశ్యంపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని కుటుంబ సభ్యుల ఫోన్‌కాల్ డేటా, లొకేషన్ ఆధారంగా పీనానాయక్ రెండవ భార్య లలితను, ఆమె ప్రియుడు రవిని విచారించారు. దీంతో మహేశ్వరి హత్య, మృతదేహం పూడ్చివేత విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మేడిపల్లి పోలీసులు, శాలిగౌరారం పోలీసుల సహాయంతో శుక్రవారం ఉదయం నేరస్తులను పట్టుకొచ్చి పూడ్చిపెట్టిన ప్రాంతాన్ని గుర్తించారు. ఇసుకలో పూడ్చిపెట్టిన మహేశ్వరి మృతదేహాన్ని వెలికి తీసి స్థానిక తహశీల్దార్ యాదగిరి సమక్షంలో పంచనామా జరిపి హైదరాబాద్‌కు చెందిన వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. మహేశ్వరి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


మహేశ్వరి (ఫైల్)

ఆస్తి పోతుందనే కక్షతో...

తనవద్ద ఉంటున్న సవతి కుమార్తె మహేశ్వరి పెళ్లికి కోటి రూపాయల కట్నం ఇస్తుండటం, కట్నం కింద ఇల్లు, బంగారం, నగదు ఇవ్వడం లలితకు నచ్చలేదు. దీంతో మహేశ్వరిపై లలిత కక్ష పెంచుకుంది. మహేశ్వరిని అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో పీనానాయక్ పేరున బ్యాంకులో ఉన్న రూ.20 లక్షల నగదును భర్తపై ఒత్తిడి తెచ్చి తన ఖాతాలోకి మార్చుకుంది. ఇక ఇల్లు, బంగారం దక్కాలంటే మహేశ్వరిని భూమి మీదలేకుండా చేయాలని నిర్ణయించుకుంది. ఈక్రమంలో లలిత తన స్వగ్రామమైన వెలిశాలకు చెందిన తన మేనమామ కుమారుడు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ అయిన రవితో వివాహేతర సంబంధం పెట్టుకొని.. మహేశ్వరిని చంపితే ఆస్తి మొత్తం తనకు, తన కుమార్తెకే దక్కుతుందని, ఎలాగైనా మహేశ్వరిని చంపాలని రవితో కలిసి పథకం రచించింది.